తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





# అత్యంత విషమంగానే చంద్రమౌళి ఆరోగ్యం

## -కన్నీటిపర్యంతంలో ఇఓ ధర్మారెడ్డి

తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:
మరోనెలరోజుల్లో పెళ్ళిపీటలెక్కాల్సిన యువకుడు ఏవి చంద్రమౌళిరెడ్డి(28) తీవ్ర గుండెపోటుకు గురై మూడురోజులుకావస్తున్నా మంగళవారం రాత్రి వరకు కూడా అతని ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగానే ఉంది. మంగళవారం రాత్రికి ధర్మారెడ్డి కుమార్తె అమెరికా నుంచి చెన్నైకు చేరుకోవడంతో, కావేరీ ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి లైఫ్ సపోర్టుని కొనసాగించాలని నిర్ణయించారు.

# చిత్తూరు జిల్లాకు 5,580 ట్యాబ్‌లు

## - 8వ తరగతి విద్యార్థులకు నేడు పంపిణీ

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:
జిల్లాలో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేయడానికి 5,580 ట్యాబ్‌లు మంజూరు అయ్యాయి. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమంను బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా చుండూరు మండలం యండ్లపల్లిలో లాంఛనంగా ప్రారంభించనుండగా జిల్లా స్థాయి కార్యక్రమంను డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజాలు చిత్తూరు కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంను అమలు చేస్తూ క్లాస్‌రూమ్‌లో సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్ తీసుకువచ్చి, క్లాస్ బయట సైతం విద్యార్థులు 24/7 సబ్జెక్టును నేర్చుకోవడానికి వీలు కల్పిస్తూ ఇప్పటి వరకు స్థితిమంతుల పిల్లలకే అందుబాటులో వున్న ఈ అవకాశం రాష్ట్రంలో నిరుపేద పిల్లలకు సిఎం వైఎస్ జగన్ ఒక మేనమామలా ఈ కానుకను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు రెడ్డప్ప, మిధున్‌రెడ్డిలు, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్ తదితరులు పాల్గొననున్నారు.

# రహదారుల ప్రగతిపై దృష్టి

## అధికారులతో ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న



రహదారుల పురోగతిపై అధికారులతో ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న సమీక్ష.

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:
జిల్లా అభివృద్ధికి దోహదపడే రహదారుల ప్రగతిపై దృష్టి కేంద్రీకరించాలని ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో మంగళవారం ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న జిల్లాలో జరుగుతున్న ఎన్‌హెచ్‌ఎఐ, ఆర్‌అండ్‌బి రోడ్ల పురోగతిపై కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి అధికారులతో సమీక్షించారు. చిత్తూరు-తచ్చూరు రోడ్డుకు సంబంధించి 116 కిమీలకు గాను 4 ప్యాకేజీలు వుండగా ఇందులో 3 ప్యాకేజీలు చిత్తూరు జిల్లాలోనే వున్నాయని అధికారులు ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు వివరించగా జనవరి 3 నాటికి ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. అలాగే బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి 85 కిమీలకు గాను 4 ప్యాకేజీలు వుండగా ఇందులో చిత్తూరు జిల్లా పరిధిలో 3 ప్యాకేజీలు వున్నాయని, నేషనల్ వైల్డ్ లైఫ్ అభ్యంతరాలతో రెండు ప్యాకేజీలు పెండింగ్‌లో వున్నాయని అధికారులు వివరించారు. అలాగే చిత్తూరు మురకంబట్టు నుండి వచ్చే దారిలో జంక్షన్ ఏర్పాటు చేయాలని, పూతలపట్టు ఎన్‌హెచ్ రోడ్డుపై ప్రమాదాల కట్టడికి ఎన్‌హెచ్, ఆర్‌టిఓ అధికారులు సంయుక్తంగా విధులు నిర్వర్తించి ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని సెక్రటరీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జరుగుతున్న ఎన్‌హెచ్‌ఎఐ, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బి రోడ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎఐ పిడిలు హరికృష్ణ, ప్రశాంత్‌లు, డిటిసి బసిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ దేవానందం, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్నేహితుడే.. హంతకుడు

## 24 గంటల్లో హత్య కేసు ఛేదించిన వెస్ట్ పోలీసులు



తిరుపతి (క్రైం), డిసెంబర్ 20, ప్రభాతవార్త
కలిసి తిరిగిన స్నేహితుడే గొంతు కోసి హత్య చేశాడు. నిందితుడిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డిఎస్పీ నర్సప్ప మీడియాకు వెల్లడించారు. కటికరంగడి వీధి, అనంత వీధికి చెందిన గుంటూరు అఖిల్ కుమార్ అలియాస్ అఖిల్ (22) పెయింట్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తోట వీధికి చెందిన తంగవేలు సోమశేఖర్ అలియాస్ సోము ఇద్దరు స్నేహంగా తిరిగేవారు, తరచూ మద్యం సేవిస్తూ ఉండేవారు. మద్యం సేవించే సమయంలో మృతుడు అఖిల్ సోమశేఖర్ కుటుంబాన్ని హేళన చేస్తూ మాట్లాడేవాడు. హత్య చేయాలని సోమశేఖర్ పథకం అన్నారు. 18 డిసెంబర్ 2022 రాత్రి అఖిల్ సోమశేఖర్ కలిసి అఖిల్ ఇంట్లో మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న అఖిల్‌ను సోమశేఖర్ గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. స్థానికులు సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు తెరి వీధికి చెందిన తంగవేలు సోమశేఖర్ (27)ను కృష్ణపురం ఠానా వద్ద వెస్ట్ సిఐ శివప్రసాద్ తన బృందంతో అరెస్ట్ చేశారు. హత్య జరిగిన 24 గంటల్లో పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. కేసు చదివించడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ డిఎస్పి నర్సప్ప, సిఐ శివప్రసాద్, ఎస్ఐలు చలపతి, ఓబయ్య, సిబ్బందికి తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి అభినందించి రివార్డులు అందించారు.

# పర్యావరణ పరిరక్షణ : ప్రకృతి పారవశ్యానికి ఊతం

## 1008 మొక్కలు నాటిన ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి జగనన్న 50వ జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జగనన్న నవరత్నాల కాలనీలో చెట్టు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని కైలాసగిరుల్లో ప్రకృతి పారవశ్యం పొందే విధంగా తీర్చి దిద్దటానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి హాజరయ్యారు. మొదటి చెట్టును శాసనసభ్యుడు ఆయన చేత నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న జన్మ దిన పండగను వారోత్సవాలుగా నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా జగననన్న నవరత్నాల కాలనీలో ముందస్తు జన్మదిన సంబరాల్లో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ కైలాసగిరి కాలనీలో రూ.18కోట్లతో నిర్మించిన రోడ్డు పక్కన ఏడాదిలో రెండు సార్లు స్వామి అమ్మవార్లుతో పాటు లక్షలాది మందిప్రదక్షిణ చేసే మార్గంలో చెట్టు నాటే కార్యక్రమాలను నాటటంలో ముఖ్య ఉద్దేశం చెట్లు పెరిగినట్లు జగనన్న ఎదగాలని చెట్లు పెంచితే మన భవిష్యత్తు అంతా ఆరోగ్యంగా ఉ ంటుందని ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, నియోజకవర్గ పర్యవేక్షకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, పగడాల రాజు,వయ్యాల కృష్ణారెడ్డి, నంద మెడికల్స్ అధినేత నరసింహారాజు, పెన్నీరుకుప్పం శేఖర్, రామచంద్రారెడ్డి, మున్నా, జయశ్యాం, తిరుకాల మల్లికార్జున్‌గౌడ్, మోహన్ నాయుడు, శ్రీవారి సురేష్, కంచిగురవయ్య, లక్ష్మీపతి, మధురెడ్డి, లీల, కొల్లూరు హరినాయుడు, జగదీశ్వరయ్య, గోరా కిరణ్,వేణు, ప్రభాకర్, చింతామణి పాండు, ఫజల్, సుబ్బానాయుడు, గణేష్, తీగల చిన్నా, మురళీ యాదవ్, రవి, హరి,పసల కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, మునిరామయ్య, సుమతి,సాగిరాబీ, సునీతసింగ్, దీపిక, లతా, రమాప్రభ, సునీత, లక్ష్మీ, జయశ్రీ, బాబూ, బావాజి తదితరులు పాల్గొన్నారు.



చెట్లు నాటుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు ఎన్ రామ్‌కుమార్‌రెడ్డి

# పొలాల్లోకి దూసుకెళ్ళిన సుమో

## ఇద్దరికి గాయాలు



శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ఓ సుమో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్ళింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి 108 ఇన్‌చార్జి అందించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదు పటాన్ చెరువుకు చెందిన ఓ కుటుంబం తిరుమలేశుని దర్శనానికి వచ్చారు. అక్కడ దర్శనం ముగించుకొని సమీపంలోని శివయ్యకు మొక్కులు తీర్చుకొనుటకు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. తిరుగుపయనంలో ఊరందూరు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులు వాహనం నడుపుతూ పంటపొల్లాల్లోకి బోల్తా పడింది, ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న డ్రైవర్ అనందాచ్చారి (54), ఆంజనేయులు (52) స్వల్ప గాయాలకు గురయ్యారు. వీరు పటాన్ చెరువుకు చెందిన వారుగా గుర్తించినట్లు వివరించారు. ప్రమాదం జరిగిన సమయంలో సుమోలో ఇంకా మంజుల, (40)స్రవంతి (20), శ్రావణి(21)లు ఉన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేదు. పంట పొలాల్లో పని చేస్తున్న రైతులు బోల్లాపడిన సుమోను లేపినారు. 108కు సమాచారం అందించినట్లు ఇన్‌చార్జి హరీష్‌రెడ్డి వివరించారు. వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాధమిక చికిత్స అందించినట్లు వివరించారు.

### ఎస్‌జె థియేటర్‌లో నటుడు విశాల్ హల్‌చల్



### శాంతిభద్రతలు కాపాడాలని టిడిపి మొక్కులు



4లో

# సర్పంచులకు నిధులు రాక విలవిల..

## అప్పులు తెచ్చి మరీ గ్రామాల అభివృద్ధి..! దిక్కుతోచని స్థితిలో సర్పంచులు

ఓజిలి, డిసెంబర్ 20, ప్రభాతవార్త
గ్రామానికి మొదటి ప్రథమ పౌరుడు సర్పంచ్. పంచాయితీలోని ప్రతి దానికి కర్త, కర్మ, క్రియ అన్నింటికి ప్రథమ పౌరుడు. అంతటి విశిష్ట హోదా ఉన్న ప్రజా ప్రతినిధులు ఇప్పుడు నిధులు లేక, నిధులు రాక తల్లడిల్లిపోతున్నారు. పదవి ఉన్నా పవర్ లేని నేతగా కాలం ఈడ్చుకొస్తున్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. గ్రామ ప్రజల అవసరాలు తీర్చడానికి పడరాని పాట్లు పడుతూ, నిధుల విషయంలో ఎవరికీ చెప్పుకోలేని దుర్భర పరిస్థితిని అనుభవిస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ లక్ష్యాలు, గడువులోగా పూర్తి కాకుంటే అధికారులు హెచ్చరికలు, వెనుకడుగు వేస్తే ప్రజల ఒత్తిళ్ల ఊరి ప్రథమ పౌరుడైనందుకు పరువు నిలుపుకునే ఆరాటం. ప్రజా ప్రతినిధి అయినందుకు పదవి కాపాడుకునే పోరాటం. ప్రభుత్వం నిర్దేశించిన పనులు సొంత డబ్బులతో పూర్తి చేసిన కాలం గడుస్తున్నా బిల్లులు రాకపోవటం లేదు. తెచ్చిన అప్పులకు మించుతున్న వడ్డీలు, డబ్బులిచ్చిన వారి నుంచి పెరుగుతున్న వేదింపులు గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఓజిలి మండలం మొత్తం 26 పంచాయితీలో ప్రతి పంచాయితీలో ప్రథమ పౌరుడు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులుగా గెలిచామన్న సంతోషమే కానీ, ఆర్థిక పరంగా ఆ గౌరవం ఎక్కడ దక్కేలా లేదు సరికదా నలుగురిలో తలెత్తుకోలేని పరిస్థితులు దాపురించాయి. నా గ్రామం, నా పంచాయితీ అనుకునే వరుసలో ముందుండే వారికి ఈ ఇబ్బందులు కొండంతలా పెరిగిపోయాయి. పంచాయితీలకు మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండి పనులు పక్క వారికి కాకుండా తాము చేసుకుంటే పది కాలాలు పచ్చగా ఉంటాయని, ఆ పనులు కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, లేస్తూ పూర్తి చేసినా బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. గ్రామ ప్రథమ పౌరుడు అనే గౌరవం పూర్వకాలంలో గొప్పగా ఉండేదని ఇప్పుడు ప్రథమ పౌరుడు పరిస్థితి చాలా దయనీయ స్థితిలో ఉందని సర్పంచులు వారు మనసుల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం ఆదుకుని నిధులు మంజూరు చేసి తమ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రథమ పౌరులు అంటున్నారు.

# రేషన్ బియ్యం లారీ పట్టివేత

సూళ్ళూరుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని హోలీక్రాస్ బైపాస్ సర్కిల్ వద్ద సివిల్ సప్లయిస్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానంతో లోడు లారీని పరిశీలించారు. లారీలో రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం కావలి నుంచి చెన్నైకి ఈ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 220 బస్తాలు లారీలో ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉష్ణోగ్రతలు

20/12/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 31 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

## బంగారం ధరలు

20/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,068

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,528

## కోడిగ్రుడ్ల ధరలు

20/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్..

## 26లక్షల బంగారం.. వెండి ఆభరణాలు స్వాధీనం



వి.కోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త
ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వరు చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వి.కోట పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దర్ని అదుపులో తీసుకుని విచారించగా వీరు కుప్పం మండలం కంగుందికి చెందిన వారని వీరు వరుస చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. కుప్పం మండలం కంగుందికి చెందిన శక్తివేల్ (43), శశికుమార్ (19)లు తాము చోరీ చేసిన సొమ్ము, నగలను అదే గ్రామానికి చెందిన గణేష్ (42) విక్రయించి పెట్టేవాడన్నారు. నిందితుల నుంచి రూ 26లక్షల విలువ గల అర్ధకిలో బంగారం, 770గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై రామకుప్పం, బైరెడ్డిపల్లి, పాకాల, వి.కోట, తమిళనాడు, కర్ణాటకలోని ముళబాగిల్ స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నటుల తెలిపారు. నిందితులనుంచి నగలతో పాటు ఇనుపరాడ్లు, చేతి గ్లౌజులు, ఫేస్ మాస్కు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.కోట సిఐ ప్రసాద్‌బాబు, కుప్పం సిఐ శ్రీధర్ పాల్గొన్నారు.

# బాధితులకు చెల్లని చెక్కులు

## రూ.90 కోట్లు కుచ్చుటోపి పెట్టిన సంస్థ నిర్వాకం - బోర్డు తిప్పేసిన సంస్థకు అధికారుల వత్తాసు

పాలసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:
ప్రజల అమాయకత్వంను అసరా చేసుకొని అధిక వడ్డీలు ఆశ చూపి ప్రజల నుండి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఓ ప్రైవేటు సంస్థ బాధితులకు చెల్లని చెక్కులు జారీ చేసి మరింత మోసం చేసింది. ఆ సంస్థ మోసం చేసిన బాధితులను ఆదుకోవడానికి జాతీయ మానవ హక్కుల భారత మండలి రంగంలోకి దిగింది. పాలసముద్రం మండలం బలిజకండ్రిగ కేంద్రంగా విట్టనాధ ఇన్‌వెస్ట్‌మెంట్ అడ్వయిజరీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పాలసముద్రం మండల పరిసర ప్రజలతో పాటు తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని ప్రజల నుండి సంస్థలో డిపాజిట్ చేసిన సభ్యులకు రూ.10 వడ్డీ చెల్లిస్తామని చెప్పి భారీ ఎత్తున డిపాజిట్లు సేకరించింది. ప్రారంభంలో కొంతమందికి రూ.10 వడ్డీ చెప్పున సభ్యులకు చెల్లించడంతో ఆ సంస్థపై నమ్మకం కలిగి పెద్ద ఎత్తున ఆ సంస్థలో ప్రజలు డిపాజిట్లు సేకరించారు. అయితే ఆపై సంస్థ ఎవరికి వడ్డీ చెల్లించకుండా కొన్ని రోజుల పాటు స్తబ్దుగా వుండిపోయింది. ఈ క్రమంలో బాధితులు డిపాజిట్ల కోసం సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదిక్షిణలు చేసినా ఫలితం లేకపోయింది. దీనికి సంబంధించి పత్రికల్లో పలు వార్త కథనాలు ప్రచురితమైనా అధికారులు పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో సెప్టెంబర్ నెలలో సంస్థ కార్యాలయం తెరిచి వుండటంతో అక్కడికి డిపాజిట్‌దారులు భారీగా చేరుకొని సంస్థ ప్రతినిధులతో వాగ్వివాదంకు దిగారు. ఈ మేరకు స్పందించిన సంస్థ ప్రతినిధులు బాధితులందరికీ న్యాయం చేస్తామని చెప్పి సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో సంస్థ ప్రతినిధులు బాధితులకు ఇటీవల చెక్కులు జారీ చేశారు. అయితే ఈ చెక్కులు బ్యాంకుకు తీసుకెళితే చెల్లడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. చెక్కులపై వున్న సంతకాలు ఫోర్జరీ సంతకాలు కావడం, బ్యాంకు అకౌంట్లలో సరైన మొత్తాలు లేకపోవడంతో బాధితులకు డబ్బులు చెల్లించడం కుదరదని బ్యాంకు అధికారులు బాధితులకు స్పష్టం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారులను ఆశ్రయించినా ఫలితం దక్కకపోవడంతో బాధితులు న్యాయం కోసం జాతీయ మానవ హక్కుల భారత మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్‌కు మొరపెట్టుకొన్నారు. ఈ మేరకు బాధితులకు న్యాయం చేయాలని భావించిన ఆయన రెండు నెలల క్రితమే ఈ వ్యవహారంపై హైకోర్టులో పిల్ దాఖలు చేసి ఈ సంస్థపై సిబిఐ, సిఐడి విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో బాధితులు వున్నారు. కాగా ఈ వ్యవహారంలో బాధితులకు అండగా నిలవాల్సిన కొంతమంది అధికారులు మోసం చేసిన సంస్థ నిర్వాహకులకు వత్తాసు పలికినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో మండలంలోని కొంతమంది కీలక అధికారులు, ప్రజాప్రతినిధులకు సంస్థ నిర్వాహకులు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.



బోర్డు తిప్పేసిన సంస్థ(ఫైల్‌ఫోటో)

# 20వేల మంది దర్శనం: రాహుకేతు పూజలకు రద్దీ

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం కూడా భక్తుల రద్దీ తగ్గలేదు. రాహుకాల సమయంలో రద్దీ బాగా కనబడింది.మంగళవారం 20 వేలకు మించి భక్తులు దర్శనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.కాగా రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలోనే జరిగాయి. అయితే ఆలయంలో దళారుల దందా తగ్గలేదు. దేవస్థానం ఎన్ని సంస్కరణలు చేపడుతున్నా ఆచరణలో అమలు జరగటం లేదు. ఓ వైపు సామాన్య భక్తులు మరో వైపు అతిధులతో ఆలయం కిట కిట లాడింది. ప్రస్తుత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టిన తరువాత దళారులను కట్టడి చేయటానికి వారి జేబుల్లో నింపుకుంటున్న మొత్తాలను శివయ్య హుండీల్లోకి



చేరటానికి కొత్త ప్రయోగం చేసారు. ఈ టిక్కెట్లు ద్వారా ప్రతి రోజూ వేలరూపాయలుఆదాయాలువస్తున్నాయి.మంగళవారంప్రత్యేక టిక్కెట్లు విక్రయాలను పరిశీలిస్తే రూ.200ల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ద్వారా 434మందిప్రవేశించగా రూ.50ల టిక్కెట్లును కొనుగోలు చేసి 1040 మంది దక్షిణ గోపురం గుండా ప్రవేశించారు. కాగారాహుకేతు దోషని వారణపూజల వివరాలు పరిశీలిస్తే రూ.500ల టిక్కెట్లుకొనుగోలు చేసి2002మంది,రూ.750లటటిక్కెట్లుకొనుగోలుచేసి789 మంది, రూ.1500లటిక్కెట్లుకొనుగోలుచేసి213,రూ.2500టిక్కెట్లు కొనుగోలు చేసి 255 మంది వివిపిల టిక్కెట్లు రూ.5వేల వి కొను గోలుచేసి53మందిపూజలుచేయించుకున్నారు.కాగాఅభిషేకాలకుకూడా విశేషం గాభక్తులుపాల్గొన్నారు.46 అభిషేకాలు జరిపించుకున్నారు. మహాన్యాసపూర్వకఏకాదశరుద్రాభిషేకాలు26జరిగాయి.శనీశ్వరాభిషేకాలు 7 హోమాలు8మృత్యుంజయస్వామి అభిషేకాలు 5,కేశ ఖండన24, ప్రసాదాలు16వేలుఅమ్ముడుఅయినట్లుఆలయాధికారులు ప్రకటించారు.

## ఎస్టీ కుటుంబాలకు నిత్యావసర సరుకులు



**తొట్టంబేడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తొట్టంబేడు పంచాయతీలోని చంద్రబాబునాయుడు ఎస్టీ కాలనీలో సుమారు 70 కుటుంబాలకు పైగా శాసనసభ్యుడు బియ్యపుమధుసూధన్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డిల ఆదేశాల మేరకు కాలనీ వాసులకు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు మండల వైస్ ఎంపిపి కన్నలిమల్లిక పంపిణీచేశారు. అనంతరం కాసారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చక్కెర వ్యాధిని గుర్తించే పరికరాలు, శివనాధపాళెంలోని అమ్మ ఆశ్రమంలో వృద్దులకు చలికాలంలో కప్పుకునేందుకు దుప్పట్లు, పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం(సుబ్బయ్య), మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యానాయుడు, మాజీ సర్పంచ్‌లు భాస్కర్, గంగాధరం,గ్రామపంచాయతీ కార్యదర్శి హంసాప్రకాష్, పంచాయతీ సిబ్బంది, హౌసింగ్ ఎఈఈ సుబ్రమణ్యం, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడేళ్ళు వేధించి..ఇప్పుడు సంబరాలా?

డాక్టర్ ఉమేష్‌రావు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



రాష్ట్రంలో వైకాపా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ప్రజలకు మూడేళ్ళపాటు అష్టకష్టాలు చూపించి నేడు సంబరాలు చేసుకుంటున్నారని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఒప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండడానికి ఇళ్ళు లేకుండా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను సైతం లెక్కచేయకుండా వారిని ముప్పతిప్పలు పెట్టి 90శాతం పూర్తయిన టిడ్కో ఇళ్ళు లబ్దిదారులకు ఇవ్వకుండా తాత్సారం చేసి ఇప్పుడు హడావుడిగా ఇళ్ల పంపిణీపేరుతో సంబరాలు చేసుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డివి దిగజారుడు రాజకీయాలని ఎద్దేవాచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైకాపా శ్రేణులు జగన్‌రెడ్డి జన్మదిన సంబరాల పేరుతో ప్రజానీకానికి ఇబ్బందులకు గురిచేయడం దానిని బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు అడ్డుకోకుండా ప్రోత్సహించడం అత్యంత దారుణమని ఆరోపించారు.

## గోతులతో విద్యార్థులకు భయం..భయం..!!

**సత్యవేడు, డిశంబర్20, ప్రభాతవార్త:**



మండలంలోని చెరివి ప్రాధమి కోన్నత పాఠశాల సమీపంలో ప్రమాదకర గోతులు ఉన్నా వాటిని పట్టించుకోక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాల కొరకు గోతులు తీశారు. నిర్మాణాలు వివిధ కారణాలతో ఆపేశారు. దాంతో ఆగోతులు ప్రమాదకరంగా మారింది. వర్షపునీరు గోతుల్లోకి చేరడంతో అవి దోమల ఆవాస కేంద్రాలుగా మారింది. సమీపంలోకి వెళ్ళి విద్యార్థులు ఆటలు ఆడుకోవాలన్నా ప్రమాదకరంగా మారింది. వీటిని పూడ్చివేసే విషయంలో సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ అధికారులకు, పంచాయితీ పాలకులకు, విన్నవించుకున్నా స్పందన లేదని చెరివి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రయివేట్ పాఠశాల బస్సు

-స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

**సత్యవేడు, డిసెంబర్20, ప్రభాతవార్త:**



స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనం పై ప్రయాణిస్తున్న స్కూటరిస్ట్ ను సత్యవేడు కు చెందిన ఓ ప్రయివేట్ పాఠశాల బస్సు మాదనపాళెం సమీపంలో ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వదరయ్యపాళ్యెం మండలంలోని పెద్దపాండూరుకు చెందిన శ్రీనివాసులు శెట్టి(55) పరిశ్రమకు ద్విచక్రవాహనం పై వెలుతున్న నేపథ్యంలో అటువైపుగా చిన్నారులను ప్రయివేట్ పాఠశాలకు తరలించే బస్సు వేగంగా ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో స్కూటరిస్ట్‌కు తీవ్రగాయాలు కావడంతో మొదటగా సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కొరకు తమిళనాడులోని జిహెచ్ హాస్పిటల్ లో చేర్చి వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు భాదితుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై భాదితుల నుంచి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకుని విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు.

## రాష్ట్రం కోసం పోరాడితే తెలుగుయువతపై కేసులా?



-రవినాయుడు

**తిరుపతి, డిసెంబర్ 20ప్రభాతవార్త:**

రాష్ట్రంలో గంజాయి, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా ,ప్రభుత్వంపై పోరాటం చేస్తే పోలీసులు కేసులు పెట్టడం మంచిదికాదని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఇటీవల తిరుపతిలో తెలుగుయువత భారీ ర్యాలీచేపట్టడంతో ఎస్వీయూనివర్సిటీ పోలీసులు తెలుగుయువతనాయకులు రవినాయుడు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్‌రాయల్, రామకృష్ణ, మరికొందరిని అరెస్టు చేశారన్నారు. సిఆర్‌పిసి 41 క్రింద నోటీసులు ఇచ్చి పంపారు. ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటే తెలుగుయువతపై అక్రమ కేసులు ఎంతవరకు సమంజసమన్నారు.

## మహిళలు సమాజంలో మొదటి స్థానంలో ఉండాలి

శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్

**తిరుపతి (విద్య), డిసెంబర్ 20, ప్రభాతవార్త**




మహిళలు సమాజంలో మొదటి స్థానంలో ఉండాలని శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఇంకా ముందు ఉండాలని వివక్ష భావం చూపించకూడదని కాబోయే తల్లులుగా పిల్లల భవిష్యత్తు ముందుకు నడిపే మహిళలుగా సమాజంలో మొదటి స్థానంలో ఉండాలని స్త్రీలు ధైర్యంగా నడవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## శివయ్య సేవలో వైకాపా జిల్లా అధ్యక్షుడు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం తిరుపతి జిల్లా వైకాపా పార్టీ అధ్యక్షుడు నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఆయనకు దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనాలు చేయించారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు సెన్నీరుకుప్పం శేఖర్, పలస కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీడి కాలనీలో గృహప్రవేశాలకు నిర్ణయం

-ఎంఎల్ఏ హజరు



**తొట్టంబేడు, డిసెంబర్ 19 ప్రభాతవార్త**

నిరుపేదలు సొంత ఇంటి కలను నెవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటిస్థలాలను కేటాయించి సబ్సిడీలో రూ.1.80లక్షలు కేటాయించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో మండలంలో మొత్తం 1325మంది లబ్దిదారులను గుర్తించి వారికి ఇంటిస్థలాలను అందించేందుకు చర్యలుతీసుకుంటున్నారు. ప్రతి ఒక్క లబ్దిదారునికి 1.50సెంట్లు స్థలాన్ని అందిస్తుండగా, మరోసెంటు స్థలంరోడ్డు కోసం కేటాయించారు. పట్టా మాత్రం 1.50సెంటుకే ఇస్తారు. ఎకరాకు 40మంది చొప్పున లబ్దిదారులకు పట్టాలు అందిస్తున్నారు. ఈసందర్భంగా మంగళవారం ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, హౌసింగ్ ఎఈఈ సుబ్రమణ్యాలు, కలసి మండలంలోని బీడికాలనీలో పర్యటించి పూర్తయిన గృహాలను పర్యవేక్షించారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని బీడికాలనీలో సామూహిక గృహనిర్మాణాలకు శ్రీకారం చుట్టునున్నట్లు ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి తెలిపారు. మండలంలో ఉన్న 27 గ్రామ పంచాయతీల్లోని నిరుపేద లబ్దిదారులను గుర్తించడంతోపాటు స్థలసేకరణ చర్యలుతీసుకున్నారు. వివాదాలు ఉన్న చోట తహశీల్దార్ పరిష్కరించి ఇప్పటికే స్థలానికి సంబందించి సర్వేరాళ్ళు నాటారు. మంగళవారం మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యానాయుడు, సర్పంచ్ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్, గంగాధరం, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యాధికారిగా డాక్టర్ ప్రవీణ్

**తొట్టంబేడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండల వైద్యాధికారిగా డాక్టర్ ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ పద్మజ బదిలీకావడంతో తిరుపతిలో ఉంటున్న డాక్టర్ ప్రవీణ్ ఇక్కడ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. తొట్టంబేడు మండల వైద్యాధికారిగా రమేష్, ఏర్పేడు ఇన్‌ఛార్జి వైద్యాధికారిలు ఉంటున్నారు. ప్రవీణ్ నియామకంతో ఇకపై రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించనున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో వైద్యాధికారి రమేష్ సేవలు అందిస్తుంటారని పిహెచ్‌సిలో డాక్టర్ ప్రవీణ్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

## రాజధానిగా అమరావతికి సహకరించండి..చక్రాల.ఉష

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతి ఉండేవిధంగా పార్లమెంటులో ఒత్తిడి తీసుకురావాలని తిరుపతి తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు మహిళా విభాగం అధ్యక్షురాలు చక్రాల.ఉష విజ్ఞప్తిచేశారు. అమరావతి రైతులు దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వదంద చేసిన ఉద్యమాల్లో చక్రాల.ఉష పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశంపార్టీ పార్లమెంటు సభ్యులు కింజారపు రామమోహన్‌నాయుడు, వైకాపా పార్లమెంటు సభ్యులు రఘురామకృష్ణమరాజును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా ఉష మాట్లాడుతూ అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చిన వైసిపి అధినేత జగన్ అధికారంలోకి రాగానే మాట మార్చాడన్నారు.

## రాష్ట్రాన్ని విభజించి పాలించేందుకే వైకాపా పాలన

-ఇదేం ఖర్మ కార్యక్రమంలో తెదేపా

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా తెలుగు దేశంపార్టీ అండగా ఉంటుందని పట్టణ పార్టీ అధ్యక్షు లు విజయ కుమార్ అన్నారు. ఇదేం ఖర్మ కార్యక్ర మంలో భాగంగా పట్టణంలోని 13వవార్డులో తెలుగు దేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిలులు ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం పట్టణంలోని 13వ వార్డులోని ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పథకాలు ఎలా ఉన్నాయి? గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పథకాలు ఎలా ఉన్నాయో ప్రజలను, యువతను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వంలో మిమ్మల్ని బాధించే అంశాలు ఏవి అన్న 14 అంశాలను కరపత్రాలు ముద్రించి పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి, రెడ్డివారిగురవారెడ్డి, తిరుపతి తెలుగుదేశంపార్టీ పార్లమెంటు కోశాధికారి కంటా.రమేష్,రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), రైతు సంఘ పార్లమెంటు నాయకుడు ప్రకాష్‌నాయుడు, షాకిరాలీ, ప్రసాద్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, కాసరం రమేష్, వజ్రంకిషోర్, మునీంద్ర, ఆర్ముగం, మాజీ టౌన్‌బ్యాంకు మాజీ సభ్యుడు ఖాదర్‌బాషా, మునిరాజయాదవ్, కరీం, దొరబాబు, బషీర్, ఎంఎస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిట్టు, సాయి, రామకృష్ణ, దిలీప్ మరియు తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల ప్రయోజనాల రక్షణకై చట్టం

## ఎంఈఓ శ్రీవరం లలితకుమారి

**చంద్రగిరి, డిసెంబరు 20 ప్రభాతవార్త:**

వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా 1986లో భారత రాష్ట్రపతి ఆమోదంతో చట్టం అమలులోకి వచ్చినట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని (డిశంబర్ 24) పురస్కరించుకుని శ్రీపద్మావతి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎంజెపిఏపిబిసిడబ్ల్యుఆర్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారుడు వినియోగదారుల హక్కులకు ముప్పు కలిగించే



విధంగా అధిక ధరలకు విక్రయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలలో వినియోగదారుడు వినియోగిస్తున్న ధరలపై సమానత్వం వుండాలన్నారు. అదేవిధంగా లోపభూయిష్ట ఉత్పత్తుల విక్రయాల మార్కెట్ దోపిడిపై వినియోగదారుల రక్షణ కొరకు చట్టం రూపొందించబడినట్లు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన ఎంజెపిఏపిబిసిడబ్ల్యుఆర్ విద్యార్థిని టి.జ్యోష్ణసాయి, వక్తృత్వ పోటీలో ఎస్పీజడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని చిన్మయి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈఓ ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, విద్యార్థుల పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్



## వేగం కన్నా ప్రాణమే మిన్న : ఎస్ఐ

ట్రాఫిక్‌పై శ్రీ చైతన్య విద్యార్థుల అవగాహనా ర్యాలీ

**చంద్రగిరి, డిసెంబరు 20 ప్రభాతవార్త:**

వేగం కన్నా ప్రాణమే మిన్న అని ఎస్ఐ హిమబిందు అన్నారు. ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి మన క్షేమంతో పాటు ఇతర ప్రయాణికులు సైతం క్షేమంగా గమ్యం చేరుకునే విధంగా వాహనాన్ని నడపాలన్నారు. అదేవిధంగా నిబంధనలను అనుసరించి మైనర్ బాలబాలికలు వాహనాలను నడపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ జమీల్ భాషా, డిన్ విజయ్‌కుమార్, ఏఓ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు



వాటర్ ట్యాంకు శుభ్రం చేయిస్తున్న ఎంఎస్ఆర్

**రేణిగుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త:**

రేణిగుంట మండలం తారకరామానగర్‌లో వ్యాధులు రాకుండా తారకరామానగర్ వైకాపా ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్) ముందస్తు చర్యల్లో భాగంగా వాటర్ ట్యాంకునుదగ్గరుండిమంగళవారంశుభ్రంచేయించారు. ఈమధ్యకాలంలోతాగునీటికొళాయిల్లో అపరిశుభ్రమైన నీరు వస్తున్నదని ఆ ప్రాంత వాసులు వైకాపా స్థానిక కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్థానిక సర్పంచ్ సాకారంతోతనసొంతనిధులనువెచ్చించివాటర్ ట్యాంకును పంచాయతీ కార్మికుల చేత శుభ్రం చేయించారు.

## పోగొట్టుకున్న సొమ్ము అప్పగించిన పోలీసులు

**రేణిగుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త:**



సైబర్ మోసగాళ్ళ వలలో చిక్కి పోగొట్టుకున్న సొమ్మును బాధితురాలు అప్పగించి పోలీసులు అందరి మన్ననలు పొందుతున్నారు. వివరాలు ఇలా.... యశస్విని తిరుపతిలో నివాసం అంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమె ఇంస్టాగ్రామ్‌కు సైబర్ నేరగాళ్లు ఒక మెసేజ్‌ను ఆగస్టు నెలలో పంపించారు. 18000 పంపిస్తే 8 లక్షలు వస్తాయని బీట్ కాయిన్ మీద ఇన్వెస్ట్ చేయమని నమ్మ బలికారు. సైబర్‌నేరగాళ్ళ మాటలను నమ్మి మొదట 18000 తరువాత 80,000 వేల రూపాయలను పంపారు. తరువాత సైబర్ నేరగాళ్ల ప్రాసెసింగ్ ఫీజు అని చెప్పి మరలా కొద్దీ కొద్దిగా మొత్తం రూ.7.8 లక్షల రూపాయలను ఆమె నుంచి తీసుకున్నారు. తరువాత సైబర్ నేరగాళ్ల శాశ్వతంగా వారి ఫోన్లను స్విచాఫ్ చేశారు. విషయం గ్రహించి అప్పటికే పూర్తిగా మోసపోయామని తెలుసుకున్న యశస్విని కంగారు పడి వెంటనే రేణిగుంట రూరల్ సీఐ ఆరోహణరావును సంప్రదించగా సీఐ జరిగిన విషయాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డికి తెలియజేశారు. ఆయన సూచనలతో తిరుపతి సైబర్ ల్యాబ్ టీమ్‌ను సంప్రదించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ ల్యాబ్ సహకారంతో సైబర్ నేరగాళ్ళ అకౌంట్లను తెలుసుకుని వాటిని ఫ్రీజ్ చేయడంతో పాటు ఆన్‌లైన్ సైబర్‌నేరగాళ్ళ ఆటలకు కళ్లెం వేశారు. తదుపరి బాధితురాలు పోగొట్టుకున్న సొమ్మును పూర్తిగా సైబర్ నేరగాళ్ళ బ్యాంక్ అకౌంట్ నుంచి రాబట్టి కోర్టు ద్వారా బాధితురాలు సొమ్మును ఆమె అకౌంట్‌లో జమ చేశారు. యశస్విని కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, రేణిగుంట రూరల్ సీఐ ఆరోహణరావు, సైబర్ ల్యాబ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు మంగళం ట్రెండ్స్ విద్యార్థినిలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 20 ప్రభాతవార్త:**



స్థానిక మంగళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మంగళం ట్రెండ్స్)కు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో జనవరిలో జరిగే వివిధ విభాగాల క్రీడలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుసి.కేశవులునాయుడుతెలిపారు. మంగళవారం ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు, విద్యాకమిటీచైర్మన్ సుశీల, సభ్యులు,తల్లిదండ్రులు అభినందిం చారు. రాష్ట్ర స్థాయిలో కోకో క్రీడకు 12 మంది ఎంపికైతే అందులో తమ పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థిని డి.ప్రత్యూష,కబడ్డీ నందు 10వ తరగతి చదివే టి.మనీషా,యోగా పోటీలకు 7 మంది ఎంపికయితే అందులో 9వ తరగతి చదువుతున్న వై.దివ్య ఎంపిక కావడం అభినందించదగ్గ విషయమన్నారు.

## చెవిరెడ్డి తండ్రికి మంత్రి రోజా సోదరుడు నివాళి

**నగరి, డిసెంబరు 20 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లా రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి(మణిరెడ్డి)76 సోమవారం అర్ధరాత్రి అకాల మృతి చెందడంతో రాష్ట్ర మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులతో కలిసి సుబ్రహ్మణ్యంరెడ్డి మృతదేహా నికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

**కేవీబీపురం, డిసెంబరు 20 ప్రభాతవార్త:**



కేవీబీ పురం మండలం ఆరె గ్రామ పంచాయతీలోని జడ్పీ హైస్కూలులో చెట్లు నాటే కార్యక్రమంలో స్థానిక వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ నాయకులు, ఫారెస్టు సిబ్బంది, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మొక్కలే జీవకోటికి ప్రాణధారం

**పుత్తూరురూరల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:**



మొక్కలు జీవకోటికి ప్రాణధారమని ప్రతి ఒక్కరు మొక్కలను పెంచడం అలవాటుగా చేసుకోవాలని పుత్తూరు ఫారెస్టు ఆఫీసర్ చంద్రశేఖర్‌రాజు అన్నారు. మంగళవారం పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు మండల కో-ఆప్షన్ మెంబరు రామ్ బత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కో మొక్కను ఇళ్ళ వద్ద పెంచాలని పాఠశాలలో మొక్కలను పెంచడం విద్యార్థులు, ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పచ్చదనం-పరిశుభ్రత అందరి ధ్యేయం కావాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతమ్మ, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో ధనుర్మాస పూజలు

**పుత్తూరురూరల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు ఆలయాల్లో మంగళవారం ధనుర్మాస పూజలు ఘనంగా చేపట్టారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా, ఓం శక్తి, ఆరేటమ్మ, బజారు వీధిలోని వినాయకస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి, ఆలయం కావమ్మ, మారయ్య రైల్వే క్వాటర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అలాగే మండల పరిధిలోని ఆలయాల్లో కూడా అమ్మవారికి స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అలాగే శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుస్వామి ఆలయంలో గోవిందస్వామి తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లారీ మోహన్, కమిటీ సభ్యులు హాజరయ్యారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర జట్టుకు ఇద్దరు ఎంపిక

**వడమాలపేట, డిసెంబరు 20 ప్రభాతవార్త:**

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు వడమాలపేట విద్యార్థులు అంజలి, పూడి శ్రావణ్ కుమార్ ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు 2, బంగారు 4, కాంస్య పతకాలు సాధించారు. అండర్ 14 ఫ్రీ స్టైల్ విభాగంలో టి.అంజలి(30 కేజీలు) బంగారు పతకాన్ని, పూడి శ్రావణ్‌కుమార్(75 కేజీలు) బంగారు పతకాన్ని లతాశ్రీ(50 కేజీలు) కాంస్య పతకాన్ని, మన్సూర్ ఆలం(57 కేజీలు) కాంస్య పతకాన్ని సాధించారు. అండర్ 17 ఫ్రీ స్టైల్ విభాగంలో కె.ఉదయకుమార్ 10వ తరగతి(80 కేజీలు) కాంస్య పతకాన్ని అండర్ 17 గ్రీగో రోమన్ విభాగంలో సి.జయసూర్య(9వ తరగతి 45 కేజీలు) కాంస్య పతకాన్ని సాధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు. బంగారు పతకాలు సాధించిన టి.అంజలి, పూడి శ్రావణ్‌కుమార్‌లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, ఉపాధ్యాయులు, పీడీ చంద్రశేఖర్‌రాజు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## అండర్ 19 కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

**తిరుపతి (క్రీడ), డిసెంబర్ 20, ప్రభాతవార్త**



ఎస్వీ డిఫెన్స్ డిగ్రీ ఉమెన్ కాలేజీ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా సెలక్షన్స్‌కి సుమారు 120 మంది బాలురు, 50 మంది బాలికలు హాజరైయ్యారు. ఎన్నుకున్న టీమ్స్ ప్రకాశం జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అండర్ 19 జిల్లా కార్యదర్శి ఎస్. జయరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విమెన్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగాదేవి, ఎన్ఐఎస్ కోచ్ చైతన్య, శంకర్, పురుషోత్తం, సాయి సుమతి, సుధారాణి, మధుమతి పాల్గొన్నారు.

# ప్రజా రవాణాలో ఇబ్బంది లేకుండా బస్సులు

- ఆక్యుపెన్సీని పెంచి సంస్థ నష్టాల్లో లేకుండా చర్యలు - ఆర్అండ్‌బి, రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న


చిత్తూరు టూ డిపోను పరిశీలిస్తున్న పిఎస్ ప్రద్యుమ్న

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను మరింత పెంచి ప్రజలు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్‌బి, రవాణా శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. అలాగే ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి ఆక్యుపెన్సీ రేటును మరింత పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్అండ్‌బి, రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న మంగళవారం చిత్తూరు టు డిపోలో పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ బస్సుల వల్ల ఆదాయం వుంటే మరిన్ని సర్వీసులను నడపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పల్లెవెలుగు బస్సు సర్వీసులను మరింత పెంచి బస్సు ట్రాకింగ్ విధానంను పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ చిత్తూరులోని రెండు డిపోల పరిధిలో 182 బస్సులు వున్నాయని, పుంగనూరులో 76, పలమనేరులో 66, కుప్పం డిపోల్లో 75 బస్సులు వున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అత్యధిక ప్రాదాన్యత ఇచ్చి బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. ఎక్స్‌ప్రెస్ మార్గాల్లో సంస్థకు మంచి లాభాలు వున్నాయని చెప్పడంతో ఈ మార్గాల్లో సర్వీసులను పెంచాలని సెక్రటరీ ఆదేశించారు. ఈ సందర్భంగా డిపోల నష్టాలకు గల కారణాలను సెక్రటరీ జిల్లా ప్రజా రవాణా అధికారిని అడిగి తెలుసుకొన్నారు.

## అత్యాధునిక టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ పనితీరు భేష్

- డ్రైవింగ్ ట్రాక్ పట్ల ప్రజల్లో మరింత అవగాహన

- రాష్ట్ర ఆర్అండ్‌బి, రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: చిత్తూరు డిటిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ పనితీరు భేష్‌గా వుందని, పారదర్శకంగా డ్రైవింగ్ టెస్ట్‌లు చేసిన వారికి లైసెన్సులు జారీ చేస్తున్నారని, ఈ ట్రాక్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని ఆర్అండ్‌బి, రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. చిత్తూరులోని ఉప రవాణా శాఖ కార్యాలయంను మంగళవారం ఆర్అండ్‌బి, రవాణా శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైవింగ్ ట్రాక్‌లో వాహనాలు నడపడం, కెమెరాలు పని చేయడం, లైసెన్సుల మంజూరు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అలాగే డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చే అభ్యర్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తీరును సెక్రటరీ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అత్యాధునిక టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. అలాగే కార్యాలయంలో జరుగుతున్న వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలను ఆయన తనిఖీ చేశారు. అలాగే రవాణా శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకుంటున్నారా! లేదా! అనే విషయాలను ఆయన అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డిటిసి బసిరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అదికారి జితేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 38.80 కోట్ల అంచనాతో మునిసిపల్ బడ్జెట్ ఆమోదం



పుత్తూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 38,80,33.400 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించారు. మంగళవారం మునిసిపల్ చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో మొత్తం రూ. 38,50,62,000 ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బడ్జెట్‌లో రోడ్ల అభివృద్ధికి రూ. 24,52,326 లక్షలు, వీధి దీపాల విస్తరణ, నిర్వహణ కోసం రూ. 9,03,488 లక్షలు, బావులు, బోర్ల నిర్వహణకు రూ. 25,81,395 లక్షలు, డ్రైన్లు, కల్వర్ట్‌ల నిర్వహణకు రూ.16,77,907 లక్షలు, పార్కుల అభివృద్ధి, నిర్వహణకు రూ. 12,90, 698 లక్షలు ఖర్చువుతుందని బడ్జెట్‌లో అంచనాలు రూపొందించారు. ఈ సందర్భంగా చైర్మన్ హరి మాట్లాడుతూ పట్టణంలోని ఒరవ కాల్వలు, డ్రైనేజీలను సక్రమంగా నిర్వహించడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎటువంటి నష్టం జరగలేదని తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా నేతృత్వంలో తాము అభివృద్ధే ఎజెండాగా పనులు చేస్తున్నామని, దీనికి కౌన్సిలర్లంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు ఎజెండాలోని 17 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు డి.జయప్రకాష్, డి.శంకర్, కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు శోభకు ఆహ్వానం



తిరుపతి (విద్య), డిసెంబర్ 20 ప్రభాతవార్త : ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో 2022 డిసెంబర్ 23,24 తేదీలలో విజయవాడలో జరగనున్న 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు డా. కొణిదల శోభకు ఆహ్వానం అందింది. ఈ ప్రపంచ మహా సభలలో డా.శోభ మహిళా ప్రతినిధుల సదస్సులో ప్రసంగించ నున్నారు. ఈ సభలలో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షులు డా. తోటకూర ప్రసాద్, భారత సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ దా.మండలి బుద్ధప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొంటున్నారని, అంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం ఆనందదాయకం అని శోభ అన్నారు. ఈ సందర్భంగా శోభకు స్నేహితులు, తెలుగు భాషా సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

## రాష్ట్రంలో ప్రజారంజక పాలన - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



నాయుడుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళ వారం ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వారోత్స వాల్లో భాగంగా నాయుడుపేటలోని అయ్యప్పరెడ్డిపాలెం జగనన్న లేఅవుట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు సుధీర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వారోత్సవాలను పండుగలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్లు చెప్పారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయాలని ధర్నా



బాలాయపల్లి, డిసెంబరు 20, ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షులు ఎం.సురేష్‌మాదిగ తెలిపారు. బాలాయపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ఎమ్మార్పీయస్ ఎంఎస్‌ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30 సంవత్సరాల నుంచి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరగాలని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల పట్ల నిర్లక్ష్యం చేస్తూ వర్గీకరణ విషయంలో జాప్యం చేస్తున్నట్లు విమర్శించారు. మరో విద్యా సంవత్సరం మాదిగలు నష్టపోకుండా ఈ పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, అదేవిధంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరో ఉద్యమానికి సిద్ధపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు అక్కుర్తి రామయ్యమాదిగ, ఎమ్మార్పీయస్ మండల నాయకులు వాన రాజకుమార్ మాదిగ, మంగళ పూరి వెంకటేశ్వర్లు మాదిగ, పల్లిపాటి పవన్ మాదిగ, పల్లిపాటి ఈశ్వరయ్య మాదిగ, పెంచలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చెవిరెడ్డికి పితృవియోగం

-చెవిరెడ్డిని పరామర్శించిన సినీ, రాజకీయ ప్రముఖులు

తిరుపతిరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి (మణిరెడ్డి) 76సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. గత కొద్ది కాలంగా సుబ్రమణ్యంరెడ్డి శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మణిరెడ్డి సోమవారం రాత్రి శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో కుటుంబ సభ్యులు హుటాహుటీన స్విమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. మణిరెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

**- ఎమ్మెల్యే చెవిరెడ్డిని పరామర్శించిన సినీ, రాజకీయ ప్రముఖులు**

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి ఆకాల మరణం తో చెవిరెడ్డి ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. నియోజకవర్గ ప్రజలే కాకుండా తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు, సినీ ఇండస్ట్రీకి చెందినవాళ్ళు చెవిరెడ్డిని పరామర్శించారు. తెలంగాణా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఆంధ్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిలు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే చెవిరెడ్డిని పరామర్శించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రెండు రాష్ట్రాల మంత్రులు చెవిరెడ్డికి ధైర్యం చెబుతూ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

## అతిథి గృహ నిర్మాణానికి పూర్వ విద్యార్థులు కోటి విరాళం

-వాక్‌తాన్‌లో ఉల్లాసం పాల్గొన పూర్వ విద్యార్థులు- ముగిసిన వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ వేడుకలు

తిరుపతిరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అతిథి గృహ నిర్మాణానికి పూర్వ విద్యార్థులు కోటి రుపాయాల విరాళాన్ని ప్రకటించారు. వ్యవసాయ వజ్రోత్సవ వేడుకలలో పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికకు గుర్తుండిపోయేలా అతిథి గృహ నిర్మాణాన్ని ఏర్పాటుకు తీర్మానించారు. మంగళవారం వ్యవసాయ కళాశాలలో వాక్‌తాన్ కార్యక్రమాన్ని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ వర్శిటీ ఉప కులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. వాక్‌తాన్ ర్యాలీ వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం నుండి అగ్రి బిజెనెస్ మేనేజ్మెంట్ ఇన్‌స్టిట్యూట్, హార్టీకల్చర్ గార్డెన్ మీదగా ప్రధాన గేటు వరకు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థులు కళాశాల మైదానాన్ని చేరుకుని, నృత్యాలతో సందడి చేసారు. అనంతరం కళాశాల అభివృద్ధిపై చర్చించారు. పూర్వ విద్యార్థుల సంఘం మరింత పటిష్టంగా ఉండాలని తీర్మానం చేసిన లోగోను వి.సి. విష్ణువర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ ఆర్.పి.వాసంతి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పెరుమాళ్ళపల్లి పరిశోధనా స్థానం అధిపతి హేమంత్‌కుమార్, విద్యార్థుల సంఘ నాయకులు, అధ్యాపకులు, విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

# అమరరాజాలో ఘనంగా ఫౌండేషన్‌డే వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న గల్లా రామచంద్ర నాయుడు, ఉద్యోగులకు సత్కారం

రేణిగుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజా బ్యాటరీస్ కర్మాగార ఆడిటోరియంలో మంగళవారం 37వ ఫౌండేషన్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. యాజమాన్య ప్రతినిధులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని సందడి వాతావరణాన్ని సృష్టించారు. పెద్ద, చిన్న ఉద్యోగ తేడా లేకుండా ఉద్యోగులంతా తిరుతమ బేధాలు మరచి ఆనందంగా గడిపారు. అమరరాజా అనుబంధ సంస్థల్లోని వారంతా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. విశేష ప్రతిభకనబరచిన ప్రతి ఒక్కరికి సంస్థ యాజమాన్యం జ్ఞాపికలు, షీల్డ్, ధృవీకరణ పత్రాలను అందజేశారు. అమరరాజా విద్యాసంస్థల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కో ఫౌండర్ చైర్మన్ జయదేవ్ గల్లా మాట్లాడుతూ 37 సంవత్సరాలుగా అమరరాజా ప్రయాణం దిగ్విజయంగా ముందుకు సాగడానికి కార్మికుల ఉద్యోగుల కృషే అన్నారు. అమరరాజా అభివృద్ధికి కృషి చేస్తూ 20 నుంచి 30 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్న వారందరిని సత్కరిస్తున్నామన్నారు. అమరరాజా ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ ఎంతో చిన్న సంస్థగా ప్రారంభించిన అమరరాజా అందరి కృషి ఫలితంగా మహావృక్షంగా మారిందన్నారు. అమరరాజా ఉద్యోగులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో గల్లా అరుణకుమారి, అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి, గౌరినేని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని పలువురు హెచ్‌వోడీలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్పీ రిషాంత్‌రెడ్డిచే కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం



వి.కోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : అంతరాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న వి.కోటలో నేరాలు అరికట్టేందుకు ఆధునాతన కమాండ్ కంట్రోల్‌రూంను జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, దొంగతనాలను పాల్పడే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ఈ నూతన కమాండ్ కంట్రోల్‌రూంను ప్రారంభించి నట్లు ఎసీ ్ప తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, సిఐ ప్రసాద్‌బాబు, ఎస్సై రాంభూపాల్ పాల్గొన్నారు.

## రాజకీయ విలువలకు నిలుటద్దంగా శాసనసభ చిత్రం

**- చిత్ర నిర్మాత తులసీయాదవ్**



చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: తాను నిర్మించి విడుదల చేసిన శాసన సభ చిత్రం రాజకీయ విలు వలకు నిలువుటద్దంగా వుందని ఆ చిత్ర నిర్మాత, పాలసముద్రం మండల వైకాపా కన్వీనర్ తులసీ యాదవ్ పేర్కొన్నారు. చిత్తూరు చాణక్య థియేటర్‌లో మంగళ వారం శాసనసభ చిత్రంను ఆయన ఉచితంగా ప్రదర్శించారు. ఈ చిత్రంను వీక్షించిన విలేకరులు, ప్రేక్షకులు చిత్ర నిర్మాణంను చూసి ఆయనను అభినం దించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 16న ఐదు భాషల్లో విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ విలువలతో తీసిన చిత్ర నిర్మాణ తులసీయాదవ్‌ను అభిమానులు సన్మానించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కుప్పంరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడా పోటీలకు స్థానిక హాకింగ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఛైర్మన్ హఫీజ్ తెలిపారు. అండర్-17 కబడ్డీ, బాడ్మింటన్, షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో తమ విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కబడ్డీ విభాగంలో మధులత, షూటింగ్ బాల్ పోటీలకు దివ్యేష్, సుహానా ఫర్వీన్, బాడ్మింటన్ విభాగానికి నిహారిక ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈసందర్భంగా పిఇటి మునికృష్ణనాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు షబ్బీర్, రఫీక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి మృతికి నగర మేయర్ నివాళి



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి సుబ్రమణ్యం రెడ్డి అలియాస్ మణిరెడ్డి పార్థివ దేహానికి తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు నివాళులు అర్పించారు. వారితో పాటు డా. మునిశేఖర్, ఇతర డాక్టర్లు రమేష్ రెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి, శ్రీ హరి, సిపాయి సుబ్రమణ్యం, యుగంధర్ తదితరులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మన్మోణి నగరోత్సవం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవంలా ధార్మికత వెల్లివిరుస్తుంది. ఈ నేపధ్యంలో ధనుర్మాసంలో ప్రతి రోజూ దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని గొబ్బెమ్మగా ప్రతి రోజూ గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి బోయిలు మోసుకుంటూ వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ సప్పరంలో ముస్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి ఆలయ ఇన్స్పెక్టర్ సురేష్‌రెడ్డి, ధఫేధార్ భద్రయ్య, ఆలయ ఉద్యోగి సురేష్ వెంటరాగా ఉత్సవం సాగింది. ఉత్సవానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ఎస్ఐ రియాజ్‌బాషా వారి సిబ్బంది పర్యవేక్షించారు.

## ఎస్‌జె థియేటర్‌లో తమిళ నటుడు విశాల్ హల్‌చల్



నగరి, డిసెంబరు 20 ప్రభాతవార్త : పట్టణంలోని ఎస్‌జె శ్రీనివాస థియేటర్‌లో తమిళ నటుడు విశాల్ సోమవారం రాత్రి హల్‌చల్ చేశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి తిరుపతిలో కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం సోమవారం రాత్రి సెకెండ్ షో విడిచే సమయంలో థియేటర్‌కు విచ్చేసి అభిమానులను అలరించారు. ఆయన నటించిన తమిళ సినిమా లత్తీ (లాఠీ) ఈ థియేటర్లో విడుదల కానున్న నేపథ్యంలో థియేటర్ యజమానుల కోరిక మేరకు ఆయన విచ్చేశారు. థియేటర్ నిర్వాహకులు మోహన్ రాజ్, మోహన్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. హాలు లోపలకు వెళ్లిన ఆయన తాను నటించిన సినిమాలోని డైలాగ్ 'నానున్ మధురకారన్ ధాన్' (నేను మధుర వాడినే) అని చెప్పడంతో థియేటర్‌లో హర్షధ్వానాలు వినిపించాయి. కాసేపు వుండి ఆయన చెన్నైకు తిరుగు ప్రయాణమయ్యారు.

## అట్టహాసంగా ముగిసిన రాయలసీమ నృత్యోత్సవాలు



తిరుపతి, డిసెంబర్ 20ప్రభాతవార్త: తిరుపతి మహతి ఆడిటోరియంలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మూడురోజులు జరిగిన శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక నృత్యోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడురోజులు పాటు పలువురు కళాకారులు ఉత్సాహంతో పాల్గొని జానపద, కూచిపూడి నృత్యాలు హోరెత్తించాయి. కళాకారులకు తగిన ప్రశంసా పత్రాలు, బహుమతులతో గుండాల గోపీనాథరెడ్డి సన్మానించారు.

## అవగాహనతోనే వ్యాపారాభివృద్ధి

**జిఎస్‌టి, ఐటిపై డాక్టర్ ఫల్గుణకుమార్**




తిరుపతి,డిసెంబర్ 20ప్రభాతవార్త: ఏ వ్యాపార రంగమైనా దానిపై ఉన్న అవగాహనతోనే అభివృద్ధి సాధ్యమని ఛార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ ఫల్గుణ కుమార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా జరిగిన మార్పుచేర్పుల గురించి మంగళవారం సాయంత్రం తిరుచానూరు రోడ్డులోని చక్రిరెసిడెన్సీ హోటల్‌లో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. టిసిసి అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు కెవి చౌదరి,డైరెక్టర్ రఘురామిరెడ్డి, పలుప్రాంతాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు కాపాడాలని

**గంగమ్మకు వెయ్యికళ్ళ దుత్తలతో టిడిపి మొక్కులు**




తిరుపతి, డిసెంబర్ 20ప్రభాతవార్త: రాష్ట్రంలో మూడున్నరేళ్ళ వైసిపి ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శాంతిభద్రతలు నశించాయని, ప్రతిపక్షాల నేతలపై కక్షసాధింపుతో భయపెడు తున్నారని, ఈ రాష్ట్రాన్ని అన్ని విధాలా కాపాడమని వేడుకుంటూ తిరుపతిలో టిడిపి నేతలు వెయ్యికళ్ళదుత్తలు తలపై పెట్టుకుని మొక్కారు. ఈ రాష్ట్రంలో ప్రజలను కాపాడాలని, శాంతిభద్రతలు కాపాడాలని కోరుతూ మంగళవారం సాయంత్రం వినూత్న నిరసన చేపట్టారు. ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఈ మొక్కులుతో గంగమ్మను ప్రార్థించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ,భూదందాలు, ఇసుకమాఫియా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులతో భయపెడుతున్నారని అన్నారు. మళ్ళీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రావాలని, ఆయనతోనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. గత మూడున్నరేళ్ళలో ప్రజలను ఇబ్బందులు పెట్టినవారిని వదలిపెట్టబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు గంజి సుధాకర్‌రెడ్డి, సుబ్బుయాదవ్, సుజాతమ్మ, మునిరాజా, దామా మురళి, సావిత్రమ్మ, మల్లిక, పార్వతమ్మ, రంగారెడ్డి, మధు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో రోడ్డు రవాణా, ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ కార్యదర్శి


నత్తపుచేను-కాణిపాకం లింక్ రోడ్డు నిర్మాణానికి పరిశీలిస్తున్న ప్రద్యుమ్న, ఈఓ

కాణిపాకం, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా మరియు రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి పీఎస్.ప్రద్యుమ్న మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా రవాణాశాఖాధికారి బసిరెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఐరాల తహశీల్దార్ సుశీల, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెంటెంట్ కోదండపాణి, ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నత్తపుచేను-కాణిపాకం లింక్ రోడ్డు నిర్మాణానికి పరిశీలన**

బెంగుళూరు-తిరుపతి 6 లేన్ రోడ్డు నత్తపుచేను నుండి కాణిపాకం వరకు లింక్‌రోడ్డు నిర్మాణానికి ఆలయ అధికారులతో కలసి ప్రద్యుమ్న పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుండి కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం నత్తపుచేను నుండి కాణిపాకం వరకు లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని దేవస్థానం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈమేరకు రోడ్డు నిర్మాణానికి ప్రద్యుమ్న పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, రోడ్లు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,BILLIPATI VENKATA RAMANAIAH (Old Name), R/o Chabolu Marripadu, NELLORE DT AP. Have Changed My Name as BALLIPATI VENKATA RAMANAIAH (New Name) W/o BALLIPATI VENKATA SUBBAIAH (New Name)

